1
నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 18, 2024 | www.navatelangana.com

ఎంపీడీఓను కలిసిన మిత్రుల బృందం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీఓ రమేష్‌ను శనివారం ఎంపిడిఓ కార్యాలయంలో తన మిత్రులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బోథ్ సాంఘిక సంక్షేమ గురుకుల వైస్ ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో ఉండటం చాలా గొప్పగా ఉందన్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ గురుకుల విద్యార్థులు, మిత్రులు పాల్గొన్నారు.



ప్రవేశాల దరఖాస్తుకు చివరి గడువు 22


నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6 నుండి 10 వ తరగతిలో ప్రవేశం కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి తుది గడువు ఈ నెల 22తో ముగుస్తుందని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేయడానికి సమీప మీ సేవా కేంద్రాల్లో లేదా ఆన్‌లైన్ కేంద్రంలో సంప్రదించాలన్నారు. 6వ తరగతిలో 100 సీట్లకు, 7 నుండి 10వ తరగతుల్లో ఖాళీ సీట్లకు ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులని, సీట్ల కేటాయింపులో స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

హస్తంలో అధ్యక్ష పోరు..!

- జిల్లా అధ్యక్ష పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు
- పార్టీ ముఖ్యుల వద్దకు ఆశావహుల ప్రదక్షిణలు
- ఎవరిని వరిస్తుందోనని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. అధికార పార్టీ కావడంతో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. ఖాళీగా ఉన్న ఈ స్థానంపై పలువురు కీలక నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవిని దక్కించుకునేందుకు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన నామినేటెడ్ పోస్టులను దక్కించుకునేందుకు అనేక మంది పోటీపడగా.. తాజాగా కీలకమైన పార్టీ పదవులు కూడా పొందేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తి రేపుతోంది. పదేండ్ల తర్వాత రాష్ట్రంలో అధికారం దక్కడంతో జోష్ మీదున్న కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ లేదంటే..పార్టీ పదవులనైనా పొందాలని ఆరాటపడుతున్నారు. ఇందుకు ప్రభుత్వ పెద్దలతో పాటు పార్టీ ముఖ్యులను ప్రసన్నం చేసుకుంటూ ఆయా పదవులకు తమ పేర్లు పరిశీలించాలని విన్నవిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిపైనా నాయకుల మధ్య పోటీ నెలకొనడంతో ఎవరికి దక్కుతుందోననే ఉత్కంఠ రేపుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్‌లో అందరి దృష్టి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష స్థానంపై పడింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఖాళీ అయిన ఈ స్థానాన్ని చేజిక్కించుకునేందుకు పలువురు పోటీ పడుతుండటం ఆసక్తి రేపుతోంది. ఎన్నికల ముందు వరకు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన సాజిద్‌ఖాన్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమకు టికెట్ దక్కలేదనే కారణంగా పార్టీకి రాజీనామా చేశారు. ఆయనతో పాటు మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ సంజీవరెడ్డిలు సైతం పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థానాన్ని భర్తీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పదవిని భర్తీచేస్తారనే ప్రచారంతో జిల్లాలోని పలువురు నాయకులు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి, తలమడుగు జడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, భరత్ చౌహన్, దుర్గం రాజేశ్వర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సైతం పోటీలో ఉండే అవకాశం కనిపిస్తోంది. ఇందులో గణేష్‌రెడ్డి ఇప్పటికే పలువురు కీలక నాయకులను కలిసినట్లు తెలిసింది. మరోపక్క శ్రీకాంత్‌రెడ్డి ఇప్పటికే పలువురు నాయకులను వెంట తీసుకొని టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు కలిసి దరఖాస్తు అందించారు. మిగితా వారు సైతం ఎవరికి వారు ముఖ్య నాయకులను కలుస్తూ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

లోక్‌సభ తర్వాతే భర్తీ..?

కాంగ్రెస్‌లో జిల్లా అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ నెలకొన్నా.. పార్టీ అధిష్టానం మాత్రం లోక్‌సభ ఎన్నికల తర్వాతే ఈ పోస్టులను భర్తీ చేయనుందని తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దలతో పాటు పార్టీ క్యాడర్ అంతా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడంపైనే దృష్టి సారిస్తోంది. రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలవాలనే ఉద్దేశంతో ఉన్న పార్టీ పెద్దలు ప్రస్తుతం జిల్లాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంపై కొంత వేచిచూసే ధోరణి అవలంభిస్తున్నట్లు కనిపిస్తోంది. మరోపక్క ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో కీలకమైన పార్టీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వారికి కీలక నాయకుల మద్ధతు కూడా అవసరమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడె గజేందర్‌ల నిర్ణయం కూడా కీలకంగా మారనుందని తెలుస్తోంది. పార్టీ అధిష్టానం వీరి సూచనలు కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందోనని ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

అలేఖ్యను హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఫాస్ట్ ట్రాక్ కోర్టును వెంటనే ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-ఖానాపూర్

అలేఖ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో అఖిలపక్ష ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కడి నుండి తాసిల్దార్ కార్యానికి వెళ్లి ఖానాపూర్ లో ఫాస్ట్ ట్రాక్ కోర్టును వెంటనే ఏర్పాటు చేయాలని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితుడు అలేఖ్యను చంపడమే కాకుండా ఆమె కుటుంబ సభ్యులను సైతం తీవ్రంగా దాడి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వము స్పందించి అలేఖ్య కుటుంబాన్ని ఆదుకోవాలని అలేఖ్య కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ఎక్సిగేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు నందిరామయ్య ,దుర్గం నూతన్ కుమార్ ,రాజ్ గంగన్న, నాయిని సంతోష్ , బొమ్మన రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఏర్పాట్లను పరిశీలించిన ఐటీడీఏ పీఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను శనివారం రామ్ లీల మైదాన్‌లో ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు అన్ని ఏర్పాట్లు చేయాలని, శాఖల వారిగా కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి దిలీప్ కుమార్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎంఅండ్‌హెచ్ఓ నరేందర్ రాథోడ్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సురేష్, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



నవతెలంగాణ-ఖానాపూర్

అంగన్వాడీకి వచ్చే పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సిడిపిఓ సరిత అన్నారు. శనివారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలు ఎప్పటికప్పుడు రెండు యాప్స్‌లో బరువు, ఎత్తులు ఎంటర్ చేయాలన్నారు. రిజిస్టర్లు అప్డేట్‌లో ఉంచుకోవాలని తెలిపారు. అంతే కాకుండా ప్రతి అంగన్వాడీ సెంటర్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సూపర్వైజర్ శ్రీలత, దినేష్, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

108లో ప్రసవం..తల్లీబిడ్డ క్షేమం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



108 అంబులెన్స్ వాహనంలో గర్భిణీ ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కేస్లాగూడకు చెందిన సెడ్మకి నీల బాయికు నెలలు నిండడంతో శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. ఇక్కడి వైద్యుల సూచనల మేర రిమ్స్ ఆస్పత్రికి 108 ద్వారా తరలిస్తుండగా మార్గ మధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. ఈఎంటీ సాయినాథ్, పైలట్ ఆత్రం అశోక్, లఖన్ ప్రాథమిక చికిత్స అందించి రిమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. కాగా108 వాహనం సకాలంలో వచ్చి ఆదుకోడంతో కుటుంబీకులు వారిని అభినందించారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి పటిష్ట చర్యలు

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ప్రాంత మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. తిర్యాణి మండలం మణిక్యాపూర్, గడలపల్లిలో ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా గిరిజన మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని, మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఎవరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధి పొంది, ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఈ టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించబడుతున్నాయని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే, వారి పిల్లల భవిష్యత్తు ఎంతో బాగుపడుతుందని అన్నారు. ఇప్పటి వరకు సుమారు 200 వరకు కుట్టుమిషన్‌లు వసుధ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్య ద్వారా అభివృద్ధి జరుగుతుందని, పిల్లలను ప్రతి రోజూ పాఠశాలలకు పంపించాలన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు తల్లిదండ్రుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 31 మంది మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, డిఎస్పి సదయ్య, వసుధ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఉమ, రెబ్బెన సిఐ చిట్టి బాబు, తిర్యాణి ఎస్ఐ రమేశ్, గడలపల్లి మాజీ సర్పంచ్ గుణవంతరావు, జిల్లా సర్మేడి మోతిరామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎస్టీపీపీ దేశంలో నెం.1 థర్మల్ విద్యుత్ ప్లాంట్

- కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా
- విద్యుత్ ఉత్పత్తి తీరుపై అధికారులతో సమీక్ష
- వీలైనన్నీ సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ దేశంలోని ఇతర ప్లాంట్లతో పోటీ పడి నెంబర్-1 స్థానంలో నిలిచిందని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా అన్నారు. శనివారం సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించారు. విద్యుత్ ప్లాంట్ కంట్రోల్ రూమును సందర్శించారు. నీటిపై తేలియాడే 5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌తో పాటు ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన 10 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అమృత్ గార్డెన్‌లో మొక్కలు నాటి ప్రారంభించారు. అనంతరం సింగరేణి సీఎండీతో కలిసి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ సత్యనారాయణరావు ఎస్టీపీపీ, సోలార్ ప్లాంట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్ మాట్లాడుతూ కేంద్ర బొగ్గు శాఖ మంత్రి అమ్రిత్ లాల్ మీనా సింగరేణికి అన్ని విధాలుగా చేయూతనిస్తున్నందున ఆయన దిశా నిర్దేశంలో సింగరేణి మరింత పురోభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సింగరేణి అన్ని రంగాల్లో మంచి పనితనం కనబర్చుతూ విద్యుత్ థర్మల్ కేంద్ర దేశంలోని విద్యుత్ కేంద్రాలతో పోటీపడుతూ మంచి పీఎల్ఎఫ్ సాధించడం గొప్ప వియషమని కితాబిచ్చారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న సింగరేణి నిల్వ భూముల్లో వీలైనన్ని సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం కోసం భూములను గుర్తించాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ సోలార్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న తీరును గుర్తు చేశారు.

విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన అన్ని హంగులు గల జైపూర్ ఎస్టీపీపీగా ఇప్పుడున్న 1200మెగావాట్ల ప్లాంట్‌ను 1800 మెగావాట్ల విద్యుత్ సూపర్ క్రిటికల్ ప్లాంట్‌గా తీర్చిదిద్దాలని అన్నారు. ఇందు కోసం అవసరమైన నీరు అందుబాటులో ఉండగా రైల్వేలైన్‌తో పాటు అవసరమైన బొగ్గు అందుబాటులో ఉన్నందున అటువైపుగా దృష్టి సారించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం కోఆర్డినేషన్ సురేష్, ఎస్టీపీపీ ఈడీ బసివిరెడ్డి, చీఫ్ ఓఎం జెన్‌సింగ్, జీఎం చింతల శ్రీనివాస్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, సూర్యనారాయణ, మనోహర్, విశ్వనాదరాజు, పంతులా నాయక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్



నవతెలంగాణ -ముథోల్

గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరావు పటేల్ అన్నారు. శనివారం మండలంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రాంటెక్ గ్రామంలో రూ.4.5లక్షలు, మచ్కల్ లో రూ.1.5లక్షలతో మురికికాలువల నిర్మాణం పనులకు, న్యూ ముద్గల్‌లో రూ.3లక్షలతో సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. పాత ముద్గల్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి యంపీటీసీ నిధులు రూ.2.5 లక్షలతో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైతే ఇన్‌చార్జి మంత్రి సీతక్క నుండి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ప్రహరీ గోడ పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలు అందే విధంగా చూడాలని కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి సత్తాచాటాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, ఎంపీటీసీ ఆత్మ స్వరూప్, నాయకులు గోపిడి ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పటేల్, భుజంగ్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రవిందర్‌రెడ్డితో పాటు పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శనివారం మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఈఈ డిఈ ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో జిల్లాలో ఎక్కడ తాగునీటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజు నీళ్ల సరఫరా చేయాలన్నారు. ఎక్కడైన పైపులైన్ మరమ్మతులు అవసరమైతే త్వరితగతిన చేయాలన్నారు. నీటి సరఫరాలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల వద్ద నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఉమర్ హుస్సేన్, భగీరథ ఈఈ వెంకటపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ కోసం 21న సమన్వయ కమిటీ సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మార్చి 9వ తేదీ నాడు నిర్వహించే లోక్ అదాలత్ కోసం ఈ నెల 21వ తేదీన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి ఎంవి రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా సాయంత్రం 5గంటలకు బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులతో పాటు ఇతర అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | ఫిబ్రవరి 18, 2024 | www.navatelangana.com

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం



గృహజ్యోతి పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ సుమన్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో వినియోగదారుల దరఖాస్తులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్‌కు ఇంకా కొంతమంది వివరాలు ఇవ్వలేదని, వారు ఆధార్, మొబైల్ నెంబర్, దరఖాస్తు నెంబర్ త్వరగా ఇవ్వాలని సూచించారు. మండల స్థాయిలో ఇంకా 2300 విద్యుత్ సర్వీస్‌లు నమోదు కావాల్సి ఉందన్నారు. వినియోగదారులు ఈ నెల 19వ తేదీ లోపు విద్యుత్ సర్వీస్ నమోదు చేసుకోవాలని కోరారు.

మహిళా, శిశు సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



వరల్డ్ విజన్ ఇండియా, జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి ఆధ్వర్యంలో 'ఫ్రంట్ లైన్ వర్కర్స్‌ని' బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా రైతువేదికలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి డీడబ్ల్యుఓ నాగమణి, సూపర్వైజర్ భాగ్యవతి, వరల్డ్ విజన్ మేనేజర్ బ్రహ్మన్న హాజరయ్యారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం, బాల్యంలో పిల్లల చదువు విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ గురించి వివరించారు. బాలల పట్ల తగు శ్రద్ధ తీసుకుని సమాజంలో వారికి మంచి భవిష్యత్తును అందించాలని డీడబ్ల్యుఓ నాగమణి అన్నారు. కార్యక్రమానికి మండలంలోని అంగన్వాడీ టీచర్లు హాజరయ్యారు.

కల్తీ కల్లుపై నిఘా ఉంచాలి

నవతెలంగాణ-కుభీర్

ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం అధ్యక్షురాలు తూము లక్ష్మీబాయి అధ్యక్షతన జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని, రైతు బంధు నిధులు విడుదల, అదే విధంగా సిరి కంపెనీ మొక్కజొన్న సాగు రైతులకు నష్ట పరిహారం అందేలా చూడాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల వైస్ చైర్మన్ మోహినోద్దీన్ మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాల్లో మొక్క జొన్న సాగు చేస్తున్న రైతులు కొందరు సిరి కంపెనీ విత్తనాలు వేసి ఎండు తెగులుతో నష్టపోయారని, వారికి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు నిధులు వెంటనె మంజూరు చేయాలని తెలిపారు. ఇటీవల పల్సి గ్రామంలో కల్తీకల్లు వల్ల జరిగిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నిఘా పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడపూర్ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రత్యేక అధికారి సరోత్తం అధికారులు, నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ సోము మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో రేషన్‌షాపులు లేక వేరే గ్రామాలకు వెళ్లి రేషన్ బియ్యం తీసుకువస్తున్న ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారికి అందుబాటులో ఉండేలా దుకాణాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు దత్తు హరి పటేల్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ చంద్రకాంత్ పాల్గొన్నారు.



మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

నవతెలంగాణ-భైంసా

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. శనివారం గణేష్‌నగర్ మున్నూరు కాపు సంఘ భవనంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల రుణాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. రూ.7.50కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను అందించారు. భైంసాలో ఎక్కువగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలు ఉన్నాయని, రుణాలను ఇస్తూ వారు ఆర్థిక పరిపుష్టి సాధించేలా చూడాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ మున్సిపల్ చైర్మన్ బి గంగాధర్, నాయకులు రావుల పోశెట్టి, ఐకెపి ఏపీఎంలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా సిసి రోడ్లకు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని వాలేగాం గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు పలు సమస్యలను విన్నవించారు. దశలవారీగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ రజాక్, బిజెపి నాయకులు భీమినేని శంకర్, సోలంకి భీంరావ్, పండిత్‌రావు, దిగంబర్, సాయినాథ్ పటేల్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

విద్యార్థులు రాణించేలా కార్యక్రమాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వివేకానంద స్ఫూర్తిని ప్రతి విద్యార్థిలో వచ్చి ఉత్సహంతో భవిష్యత్తులో రాణించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు భూమన్న అన్నారు. ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన వివేక జ్యోతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శనివారం జిల్లా స్థాయిలో పరీక్షలను నిర్వహించారు. పట్టణంలోని సంజయ్ నగర్‌లో గల సేవా సమితి కార్యాలయంలో నిర్వహించిన పరీక్షలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ఈ పరీక్షలో ఏడు మండల పరిధిలోని 40 పాఠశాలల నుంచి దాదాపు 50 మంది విద్యారులు హాజరయ్యారు. ప్రపంచ దేశాలకు భారత దేశ ఔన్నత్యాన్ని చాటిన మహానీయుడు స్వామి వివేకానంద గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు ఆరె భూమన్న అన్నారు. తమ వంతుగా విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్రపై పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వివేకానంద చెప్పినట్లు ఏదైన సాధించడానికి నిర్సుహం చెందకుండా ఉత్సహంతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే ఆ పనిలో విజయం సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా విద్యార్థులు ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొరెడ్డి లెనిన్, సభ్యులు హన్మండ్లు, శ్రీధర్, ఉపాధ్యాయులు కూడల రవీందర్, కొడిమేల మధు, నర్సిములు, లక్ష్మీ సంగీత పాల్గొన్నారు.

విద్యార్థులకు షీటీంపై అవగాహన

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి ఉన్నత పాఠశాలలో శనివారం షిటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. షిటీం ఎస్‌ఐ సుమలత మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు సమస్యలు వచ్చినట్లైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి సమస్యను భయపడకుండా చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో షిటీం కానిస్టేబుల్ రమాదేవి పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా కొనుగోలు చేయొద్దు

నవతెలంగాణ-బేల

మార్కెట్ కమిటీ లైసెన్స్ లేకుండా మండలంలోని రైతుల వద్ద నుండి పత్తి, సోయాబిన్, కందులు, శనగలను కొనుగోలు చేయరాదని జైనథ్ వ్యవసాయ కమిట కార్యదర్శి మధుకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా రైతుల నుండి కొనుగోలు చేసిన వారిపై మార్కెట్ కమిటీ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ లేని వారి వద్ద అమ్మితే రైతులు మోసపోయే అవకాశముందన్నారు. నియమ, నిబంధనలకు లోబడి వ్యాపారం చేస్తూ, మార్కెట్ కమిటీ వారికి సహకరించాలని సూచించారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఆదిలాబాద్‌లో..



ఖానాపూర్‌లో..



పెంబిలో..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని, అదే అభివృద్ధిని నూతన కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శనివారం బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో శ్రేణులతో కలిసి జోగు రామన్న కేక్‌కట్ చేసి మాజీ సీఎం కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ హయంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టిన మహనేత కేసీఆర్ గుర్తు చేశారు. ఎమ్మెల్యే నుంచి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, తెలంగాణకు రెండు సార్లు సీఎంగా పని చేశారని తెలిపారు. టీఆర్ఎస్‌ను స్థాపించి బంగారు తెలంగాణ దిశగా అడుగు వేశారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను ఇచ్చిన గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలు పేదలకు పథకాలు అందేలా క్షేత స్థాయిలో పర్యటించాలన్నారు. ఇదిలా ఉంటే అటూ కేఆర్కే కాలనీలోని వృద్ధాశ్రమంలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, జిల్లా ఉపాధ్యక్షులు వీజ్జగిరి నారాయణ, యూనిస్ అక్బాని, సాజితోద్దీన్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మహిళా అధ్యక్ష కార్యదర్శులు స్వరూప, బోడగం మమత, కస్తాల ప్రేమల, సుల్తానా, దాసరి రమేష్ పాల్గొన్నారు.

తలమడుగు : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు 70వ పుట్టిన రోజు పురస్కరించుకొని శనివారం మండలంలోని లింగి వృద్ధాశ్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట వెంకటేష్, కేదారేశ్వర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్, గంగాధర్, ఆశన్న యాదవ్, సునీత, పోచన్న, పోతారెడ్డి, దేవ్‌రావ్, నాగరెడ్డి, అభిరాంరెడ్డి, మేకల రవికాంత్, రాంకిష్ పాల్గొన్నారు.

బేల : మండలం కేంద్రంలోని జెట్పీటీసీ కార్యాలయంలో శనివారం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంభీర్ ఠాక్రె, ప్రమోద్ రెడ్డి, జక్కుల మధుకర్, మస్కె తేజరావ్, ఇంద్రశేఖర్ పాల్గొన్నారు

ఖానాపూర్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు తెలంగాణ తల్లి చౌరస్తాలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజ గంగన్న, మాజీ జెడ్పిటిసి రామునాయక్, అంకం రాజేందర్, మాజీ సర్పంచ్ ఆకుల వెంకాగౌడ్, సత్తెనపల్లి పిఏసిఎస్ చైర్మన్ ఆనంద శ్రీనివాస్, కొక్కుల ప్రదీప్, డబ్బా శ్రీనివాస్, కౌట మహేష్, గౌరీకర్ రాజు, ఇర్ఫాన్, విపిన్, చింటు పాల్గొన్నారు.

కడెం : హరిత రిసార్ట్‌లో శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి కో ఆప్షన్ మెంబర్ ఎండి రఫిక్ అహ్మద్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, ఖానాపూర్ ఆత్మ కమిటీ చైర్మన్ కానూరి సతీష్, చిన్న బెల్లాల్ మాజీ సర్పంచ్ శ్రీకాంత్, దిల్దార్‌నగర్ మాజీ సర్పంచ్ విజయ-స్టీఫెన్, కడెం టౌన్ అధ్యక్షులు రవి, రైతుబంధు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షులు చిట్టేటి ముత్తన్న, మండల యూత్ అధ్యక్షులు గౌసోద్దీన్, పార్టీ సీనియర్ నాయకులు ఎండి కలీం, గంగేశ్వర్, వేణుగోపాల్ నాయక్ పాల్గొన్నారు.

కుభీర్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా కార్యదర్శి తూము రాజేశ్వర్, పీరాజి, విజయ్ కుమార్, నగలింగం, వైస్ ఎంపీపీ మోహినోద్దీన్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్ పాల్గొన్నారు.

పెంబి : మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు 70వ జన్మదిన వేడుకలను మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, ఫలహారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

సిరికొండ : బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించి సంబురాలు చేసుకున్నారు. తెలంగాణ జాతి పిత కేసీఆర్ అని పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటన్న, ఇక్బాల్, రాజన్న, మల్లేష్, లతీఫ్, రోహిదాస్, సూర్యకాంత్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరుపకున్నారు. శనివారం ఆచర్య జయశంకర్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కందుకూరి రమేష్, ఎంపీపీ పంద్ర జైవంత్ రావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, సమా ప్రభాకర్ రెడ్డి, రమేష్ పటేల్, సింగరే భారత్, ముజీబ్ ఖాన్, సాడిగె రాజకుమార్, సోనీరావు, జుబేర్ ఖాన్, భూమన్న, అబ్రర్ అహ్మద్, ఎండీ కలీం పాల్గొన్నారు.

పులిమడుగులో..

మండలంలోని పులిమడుగు గ్రామంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు బాబా టైగర్ ఆధ్వర్యంలో కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు.



ఉట్నూర్‌లో..



కుభీర్‌లో..



తలమడుగులో..

పూలే దంపతుల సాహిత్యాన్ని చదివి ఉద్యమించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు రాసిన సమగ్ర సాహిత్యాన్ని బహుజన సాహితీవేత్తలు చదివి సామాజిక న్యాయం, సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. మహారాష్ట్రలోని జరూర్‌లో శనివారం జరిగిన 22వ సాహిత్య సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుకుమార్ తెలుగులో అనువదించిన సత్యశోధక్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. జ్యోతిబాపూలే దంపతులు రాసిన సాహిత్యాన్ని మాలీ కులస్తులతో పాటు బహుజన కులాల్లో ప్రచారం చేసి బహుజన వాదాన్ని బలపరచాలన్నారు. మాలీ కులస్తులు తమ ఆరాధ్య దైవమైన జ్యోతిబాపూలే దంపతులు చెప్పినట్లుగా తమ పిల్లల వివాహాలను సత్య శోధక పద్ధతిలోనే జరిపించాలని సూచించారు. ప్రపంచ వేదావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాత్మ జ్యోతిరావు పూలేను తన గురువుగా భావించాడని అంత గొప్ప మేధావి జ్యోతిరావు పూలేని గురువుగా భావించారన్నారు. ఈ కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ గురనులే, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ ఉమేష్ రావు డోలే, సోషల్ మీడియా ఇన్‌చార్జి మయూర్ మొహూర్లే, కార్యక్రమ నిర్వాహకులు శ్రీకృష్ణ బంసోడ్ పాల్గొన్నారు.

పీఈటీ సస్పెన్షన్, హెచ్ఎంకు షోకాస్ నోటీస్

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న పీఈటీ కె.సాగర్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎ.రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తించినట్లు వచ్చిన వార్తాల ఆధారంగా జిల్లా సంక్షేమాధికారి విచారణ జరిపారు. మండల విద్యాధికారి ప్రాథమిక నివేదిక ఆధారంగా సాగర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి, సరిగా పర్యవేక్షణ చేయని కారణంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కు షోకాజ్ నోటీష్ జారీ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఆర్జేడికి నివేదిస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వం

నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమని మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని ధర్మాజీపేట్, కొత్తమద్దిపడగ, నచ్చన్‌ఎల్లాపూర్, మాసాయిపేట్, నర్సాపూర్, లింగాపూర్, ఎలగడప, దిల్దార్ నగర్ గ్రామాలలో సిసి రోడ్, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడిగెల భూషణ్, తాళ్లపల్లి రమేష్, ముస్కు రాజు, కొత్తమద్దిపడగ మాజీ సర్పంచ్ రాజమణి ఇందూర్, సత్యం, యాదగిరి, జగన్మోహన్‌రెడ్డి, లింబన్న, శీను, గంగాధర్, మాదాస్, రాజేశ్వర్, రాజేష్, రాజేశ్వర్, సుమన్, రాజన్న, అన్వర్, కమలాకర్, సలీం, రహీం, భూమేష్ పాల్గొన్నారు.



కాసిపేట-1 గని సందర్శించిన ఎస్ఓ టూ డైరెక్టర్



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గనిని, టన్నెల్ గనిని ఎస్ ఓ టూ డైరెక్టర్ నాగేశ్వరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కాసిపేట టన్నెల్ మెయిన్ పనులను, మ్యాన్ రైడింగ్ ఏర్పాట్లను ప్రాజెక్టు, ప్లానింగ్ విభాగం ఎస్ఓ టూ డైరెక్టర్ నాగేశ్వర్ రావు పర్యవేక్షించి అధికారులకు ఆదేశాలిచ్చారు. పనులను వేగవంతం చేసి బొగ్గు ఉత్పత్తిని తీసుకురావాలని, ఉద్యోగులకు మ్యాన్ రైడింగ్ త్వరగా ఏర్పాటు చేయడం వల్ల పని స్థలాలకు త్వరగా వెళ్లేందుకు వీలుగా ఉంటుందని, శ్రమభారం తగ్గించడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు అన్ని విధాలుగా కాసిపేట గని అనుకూలమైనదని ఉత్పత్తి రావడానికి అనుకులమైనదన్నారు. ఈ సందర్భంగా గని ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎస్ఓ టూ డైరెక్టర్ను అధికారులు, నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రామదాసు, మేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్, రాజేందర్, నాగేశ్వరరావు, టీబీజీకేఎస్ నాయకులు బైరి శంకర్, సోల్లంకి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్ నాయకులు బన్న లక్ష్మన్ దాస్, ఎస్వో సునీల్ కుమార్, సంక్షేమ అధికారి మీర్జా గౌస్ జీషాన్, ఇంజనీర్లు బాబు, మధుకర్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, నిఖిల్, సుమన్, వంశీ కృష్ణ, దిలీప్, రామకృష్ణ, వెంకటేశ్వర రావు, ఖాన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మక తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 18, 2024 | www.navatelangana.com

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ లోకేశ్వర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం మండల కేంద్రంతో పాటు కలగాం, ధనోర, సురదాపూర్, మోడీ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలను చేశారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం మండలంలోని ఓటర్లకు అందుబాటులో ఉంటూ పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, ఆర్ఐ సిద్దార్థ్, శవంత, సిబ్బంది పాల్గొన్నారు.

పిలుపు పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సీనియర్ సిటిజన్లకు సంబంధించిన పిలుపు పత్రికతో పాటు డైరీని శనివారం హైదరాబాద్‌లో హైకోర్టు రిటైర్డ్ జస్టిస్, మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మెన్ జి చంద్రయ్య ఆవిష్కరించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ సిటిజన్ అసోషియేషన్ సభ్యులు ఆయనను కలిసి ఈ పత్రికను ఆవిష్కరింపచేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను సమాజం గౌరవించుకుంటుందని, వారి రక్షణ, పోషణకు ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. జిల్లాలో సీనియర్ సిటిజన్లకు ఏ సమస్య వచ్చినా తాను వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సరుకుల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహృదయ ఫౌండేషన్ సహకారంతో కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామంలో శనివారం పేద ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శరత్ సుదర్శి మాట్లాడుతూ పేద మహిళలు, పిల్లల కోసం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు కుటుంబాలను పోషించుకోలేక అనేక అవస్థలు పడుతున్నారని, వారికి ప్రభుత్వం నుండి అందే సహకారం సరిపోవడం లేదన్నారు. అటువంటి వారికి సహాయం చేసేందుకు తాము ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. తమ సేవా కార్యక్రమాలకు చేయూత అందిస్తున్న సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిందు తాడివాక(యూఎస్ఏ)కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుర్గం విస్తారు, ఎంపీయూపీఎస్ ప్రధానోపాధ్యాయులు రవికాంత్, గ్రామస్థులు ఎస్.శ్రీనివాస్, ఎం.శ్యాంరావు, ఫౌండేషన్ సభ్యులు దుర్గం విశాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వైద్యాధికారి వివేకవర్ధిని వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 97 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఇద్దరు విద్యార్థులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రేఫర్ చేశామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సువర్ణ, ఫార్మాసిస్టు సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని సాధించాలి

- డీఐఈఓ నైతం శంకర్




నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రాందాస్ అధ్యక్షతన నిర్వహించిన ఫేరవల్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని వాటిని సాధించాలన్నారు. ఇంటర్మీడియట్ సమయం ఎంతో ప్రాధాన్యమైనదని దానిని వృథా చేయకూడదన్నారు. భవిష్యత్తును నిర్ణయించే దశ ఇంటర్మీడియట్‌యే అన్నారు. అధ్యాపకుల సలహాలు తీసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళు లక్ష్మణరావు, పరుశురాం, అమరేందర్, మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కనకయ్య, లెక్చరర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్ రెడ్డి, శ్రీనివాస్, అధ్యాపకులు చంద్రయ్య, సంతోష్, భీమయ్య, సునీల్, శ్రీనివాస్, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా క్వార్టర్లలో ఉండేవారు ఖాళీ చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఎస్‌బీ క్వార్టర్లలో అక్రమంగా నివాసముంటున్న వారు త్వరగా ఖాళీ చేయాలని పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని పలు డిపార్టుమెంట్లలో, గనుల్లో సుమారు వంద మంది ఉద్యోగులు, 47 మంది జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో చేరారని, వారి కోసం నిర్మించిన సింగరేణి క్వార్టర్లు అక్రమంగా ఉంటున్న సింగరేణేతరులు త్వరగా ఖాళీ చేసి యాజమాన్యానికి అప్పగించాలని ఆయన కోరారు. ఎస్‌బీ క్వార్టర్లలో అక్రమంగా నివాసముంటున్న వారు గతంలో లిఖితపూర్వకంగా నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. కానీ ఇప్పటివరకు వారు ఖాళీ చేయలేదన్నారు. రెండు వారాల్లో క్వార్టర్లు ఖాళీ చేసి యాజమాన్యానికి అప్పగించాలని, లేని పక్షంలో సింగరేణి యాజమాన్యం నిబంధనల ప్రకారం క్వార్టర్లను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.



మహిళల రక్షణే భరోసా సెంటర్ లక్ష్యం

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్



భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు, చిన్నారుల సంరక్షణ పోలీసుల ప్రధాన ధ్యేయమని దీని కోసమే ప్రత్యేకంగా భరోసా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు భరోసానిస్తూ, బాధిత మహిళలను, పిల్లలను అక్కున చేర్చుకొని, కొండంత ధైర్యాన్నిస్తూ, మహిళలు, పిల్లల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా భరోసా కేంద్రం సేవలు అందిస్తుందని అన్నారు. ఈ సెంటర్ ద్వారా వివిధ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోక్సో, అత్యాచార కేసులలో కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు, సీడబ్ల్యూసీ ద్వారా బాధిత మహిళలకు షెల్టర్ కల్పించడం జరుగుతుందన్నారు. పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు మొదలుకొని చివరివరకు అన్ని తానై వెన్నంటి ఉంటూ, బాధిత మహిళలకు అండగా ఉంటుందన్నారు. ఈ చట్టాలన్నీ ఫోక్సో చట్టం, పిల్లల చట్టాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. బాధితులకు భరోసా సెంటర్ అండగా ఉంటుందని వేదింపులు, అత్యాచారం, బాధిత మహిళలకు, పిల్లలకు ఒకే చోట మెడికల్, న్యాయసలహా, వైద్యం, కౌన్సిలింగ్, సైకాలజికల్ సమస్యలను ఇలా అన్ని సౌకర్యాలు ఒకే చోట కల్పిస్తూ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను, హింసను తగ్గించడమే ప్రధాన లక్ష్యమని, మహిళలు, యువతులు, బాలికలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఆసిఫాబాద్ సీఐ సతీష్, ఎస్ఐ రాజ్యలక్ష్మి, ఆర్ఎస్ఐ రాజేష్, ఆసిఫాబాద్ షీ టీమ్ ఇన్‌చార్జి సునీత, కాగజ్‌నగర్ షిటీమ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, భరోసా సెంటర్ సిబ్బంది, షీ టీమ్ సభ్యులు, మహిళ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



భరోసా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం కావాలి

- జాతీయ హరితదళం కోఆర్డినేటర్ విద్యాసాగర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

నేడు విస్తరిస్తున్న కాలుష్యానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ భూతమేనని, దీనికి ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ హరితదళం కో ఆర్డినేటర్ విద్యాసాగర్ అన్నారు. శనివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (సర్‌సిల్క్)లో జాతీయ హరితదళం ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్-ప్రత్యామ్నాయ మార్గాలు' అనే అంశంపై డ్రామాతో పాటు ఏకపాత్రాభినయం పోటీలను నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని నివారించడం, విద్యార్థులలో అవగాహన కల్పించడం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌ఛార్జి విద్యాధికారి వెంకటేశ్వరస్వామి మాట్లాడుతూ నేడు శాస్త్ర సాంకేతికరంగాలలో వచ్చిన మార్పుతో ప్రపంచం అభివృద్ధి బాటలో పయనిస్తున్నా, మనం ప్లాస్టిక్ భూతాన్ని ఎదుర్కొలేకపోతున్నామన్నారు. ఇది మన జీవితాలను ఎంతో ప్రభావితం చేస్తోందని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్ మాట్లాడుతూ విద్యార్థులలో అవగాహన కోసం నిర్వహించిన ఈ పోటీలకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరై కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా గుర్రాల వెంకటేశ్వర్లు, యు నరసింహాచారి, రాజకమలాకర్‌రెడ్డి వ్యవహరించారు.



డ్రామా నిర్వహిస్తున్న విద్యార్థులు

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి



సెక్టార్ అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర ముఖ్యమైందని, అప్రమత్తంగా ఉంటూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలపై సెక్టార్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడంలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైనదని, వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని, ఈవీఎం, వీవీ ప్యాట్లు, హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, పోలింగ్ కేంద్రాలలో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని తెలుసుకొని ఉండాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చే సిబ్బందికి ఎన్నికల రోజున సూచనలు అందించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు, రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఈవీఎంలలో సమస్య తలెత్తితే రిజర్వు ఈవీఎంలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎన్నికల్లో 17 సీ డైరీ, ప్రిసైడింగ్ డైరీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే శిక్షకులతో నివృత్తి చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, సెక్టార్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ బాపు అని కొనియాడారు. పదేండ్లలో ఆకర్షించేల కేసీఆర్ పరిపాలన సాగించారని తెలిపారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అహ్మద్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ వెంకన్న, మాజీ ఎంపీటీసీ సుగుణాకర్, నాయకులు కార్తీక్, వినోద్, నిసార్, గుండా వెంకన్న, పాల్గొన్నారు.





వాంకిడి : మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ సర్పంచ్ బండె తుకారాం, కమాన ఎంపీటీసీ ఇద్రె ప్రవీణ్, బీఆర్ఎస్ యువజన సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సదాశివ్, కమలాకర్ పాల్గొన్నారు.

అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావుకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అదనపు ఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న అచ్చేశ్వరరావును బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని బీసీ సంక్షేమ, యువజన సంఘం నాయకులు ఆకాంక్షించారు. జిల్లాకు ఆయన అందించిన సేవలను మరిచిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం, బాలేష్, రైతు అధ్యక్షులు వైరాగడే మారుతీ పటేల్, బీసీ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు బొట్టుపెల్లి ప్రశాంత్, బీసీ నాయకులు మెంగ్రే బాపూరావ్, రాపర్తి నర్సింహా, శంకర్ పాల్గొన్నారు.



నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుత సంవత్సరంలో రైతులకు సకాలంలో బ్యాంకర్లు రుణాలు అందించాలని, వారికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి బ్యాంకర్లను ఆదేశించారు. రుణ ప్రణాళిక లక్ష్యాలపై బ్యాంకరులు, మెప్మా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు సకాలంలో రుణాలు అందజేయాలన్నారు. దీనివల్ల రైతు బీమా పొందే అవకాశం దక్కుతుందని తెలిపారు. ప్రస్తుత సంవత్సరంలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీలకు 100శాతం బ్యాంకు ఖాతాలు తెరవాలన్నారు. విశ్వకర్మ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్త్రీ నిధి ఇతర పథకాలు ద్వారా స్వయం సహాయక సంఘాల వారికి రుణాలు అందజేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 2653 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా రూ.1812 కోట్లు మాత్రమే ఇప్పటివరకు సాధించామన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. అప్పుడే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కోవ హనుమంతరావు, ఆర్‌బీఐ ఎల్డీఓ అనిల్ కుమార్, నాబార్డ్ డీడీఎం అబ్దుల్ రావు, డీఆర్డీఓ సురేందర్, డీటీడీఓ రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

చెరువు పూడికతీత పనుల్లో అవినీతి



నవతెలంగాణ-రెబ్బెన

చెరువులో ఉపాధిహామీ చట్టం క్రింద చేపట్టిన పూడికతీత పనుల్లో భారీగా అవినీతి జరిగిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. గోలేటి మానెపెల్లికుంట చెరువు వద్ద బీజేపీ నాయకుల బృందం శనివారం పర్యటించింది. మానెపెల్లికుంట కోసం ఎన్ఆర్ఈజీయస్ పథకం క్రింద రూ.9.32 లక్షల పనులు చేసినట్టు శిలాఫలకాన్ని వేసి, నామమాత్రంగా పనులు చేపట్టి లక్షలు కాజేశారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. ఈ చెరువుకు ఉనకొక తూముకు గేటు ఏర్పాటు చేయకపోవడంతో 200 ఎకరాల ఆయకట్టుకు నీరు అందక రైతులు పంటలు పండక తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు. కొంతమంది రైతులు భూములను సాగుచేయడం లేదని, గత అధికార బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మానెపెల్లికుంటకు రెండు పంటలకు నీరు అందిస్తామని, మినీ ట్యాంకుబండుగా మార్చుతానని ఎన్నికల్లో హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత రైతులను మోసం చేశారన్నారు. రెండు పంటలకు కాకుండా కనీసం ఒక్క పంటకైనా నీరు ఇవ్వలేకపోయారని ఆయన విమర్శించారు. రైతులు పంటలు పండక తీవ్ర నష్టాలకు గురవుతున్నారని, అదేవిధంగా గోలేటి రిజర్వాయర్ 800 ఎకరాలకు నీరు అందించాల్సి ఉండగా రెండు తూములు, కాలువలు దెబ్బతిని రెండు సంవత్సరాల నుండి నీరు అందక భూములు బీళ్లుగా మారుతున్నాయన్నారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రెండు చెరువులకు మరమ్మత్తులు చేసి రైతులను ఆదుకోవాలని, అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వై కృష్ణకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, సేవాలాల్ సేనా ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శులు జగన్నాథ ఓదెలు, చేకూరి నవీన్‌గౌడ్, బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు శనిగారపు శ్రీనివాస్, జర్పుల తిరుపతి పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్ సేవలు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుమురం భీమ్ స్టడీ సర్కిల్ సేవలు వినియోగించుకొని గిరిజన విద్యార్థులు మరింత ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకున్న ఆరుగురు పోలీస్ ఉద్యోగం సాధించగా వారికి నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రశంసాపత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలి ప్రయత్నంలోనే అభ్యర్థులు ఉద్యోగం సాధించి భవిష్యత్తులో మరింత మందికి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. మరింత మంది ఇదే స్ఫూర్తితో ఉద్యోగం సంపాదించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్టడీ సర్కిల్ నుండి ఇప్పటివరకు 15 మందికి పైగా అభ్యర్థులుఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. వీరి విజయంలో పాత్రధారులైన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కుమురం భీమ్ స్టడీ సర్కిల్ అధ్యక్షులు రాయిసిడం రాము, కోశాధికారి ఇందు రావు, స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ఉషన్న, రాజశేఖర్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | ఫిబ్రవరి 18, 2024 | www.navatelangana.com

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-మందమర్రి



మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రాజశేఖర్ శనివారం పరిశీలించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా చిర్రకుంట నర్సరీని సందర్శించిన అనంతరం ఆదిల్ పేట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. వేసవి కాలాన్ని దష్టిలో పెట్టుకుని త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమములో బి టీరయ్య ఎంపీఓ, ఎండీ రజియా ఏపిఓ(ఈజీఎస్), టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ధర్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకొని ముందుకు ఎలా సాగాలో అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ నాగరాజు, ఏఓ వందన, మండల నోడల్ అధికారి రాథోడ్ రమేశ్, హెచ్ఎంలు సాంబమూర్తి, సుధాకర్ నాయక్, రమణారెడ్డి పాల్గొన్నారు.

సద్దుమణిగిన ఐకే ఓసీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-జైపూర్

● సెకండ్ షిప్టు విధులకు హాజరైన కార్మికులు



కార్మికుల సమ్మెతో ఓసీ తవ్వకాలు నిలిచి ఆగిఉన్న లారీలు

ఇందారం ఓపన్‌కాస్ట్ గని కార్మికులు చేపట్టిన సమ్మె ఎట్టకేలకు సర్దుమనిగింది. శుక్రవారం సెకండ్ షిఫ్టు నుండి కార్మికులు సమ్మెకు దిగినట్లు ఆలస్యంగా బయట కువచ్చింది. విషయం బయటకు తెలియకుండా జాగ్రత్తపడిన యాజమాన్యం కార్మికులతో జరిపిన చర్చలతో సమ్మె విరమించి విధుల్లో చేరినట్లు తెలిసింది. శుక్రవారం సెకండ్ షిఫ్టు, నైట్ షిఫ్టుతో పాటు శనివారం ఫస్ట్ షిఫ్టులకు కార్మికులు దూరంగా ఓబీ తొలగింపు, బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. కాగా సింగరేణి నుంచి ఓసీ కాంట్రాక్టు పొందిన వరహా కోల్ కంపెనీ కార్మికులకు చెల్లించాల్సిన జీత భత్యాలు సక్రమంగా చెల్లింకపోవడం సమ్మెకు కారణమైందని తెలుస్తోంది. సుమారుగా 250 మంది కార్మికులు ఓసీలో విధులు నిర్వర్తిసుండగా గత రెండు నెలల నుంచి జీత భత్యాలు చెల్లించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కార్మికులు సమ్మె చేయాల్సివచ్చినట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన యాజమాన్యం సదరు కంపెనీపై ఒత్తిడి పెంచడంతో కార్మికులతో జరిపిన చర్చలు ఫలించడంతో సమ్మె సర్దుమనిగింనట్లు తెలుస్తోంది. ఇక నుంచి ప్రతి నెల 10 తేదిలోపు కార్మికులకు జీత భత్యాలు చెల్లించడానికి వరహా కోల్ కంపెనీ అంగీకరిస్తూ కార్మికులకు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

మూడు షిఫ్టుల్లో నిలిచిపోయి ఓబీ తవ్వకాలు

నెల నెల జీతాలు చెల్లించకపోవడంతో ఆగ్రహం చెందిన ఇందారం ఓసీ కార్మికులువిధులకు దూరం కావడంతో మూడు షిఫ్టుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రతి షిఫ్టుకు 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సివుండగా శుక్రవారం సెకండ్ షిఫ్టు నుండి శనివారం సెకండ్ షిఫ్టు వరకు మొత్తంగా 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం జరిగింది. ఓసీ కాంట్రాక్టు పొందిన వరహా కంపెనీకి గత అనుభవం లేకపోగా నిర్వాహకుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఓసీ నిర్వాహణలో తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ఆరోపనలు విన్పిస్తున్నాయి. నిర్దేషిత లక్ష్యంతో రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా కొనసాగాలని ఒక వైపు సింగరేణి యాజమాన్యం స్పష్టం చేస్తుండగా మరో వైపు ఊహించకుండా ఉత్పత్తి, రవాణాకు విఘాతం ఏర్పడటం సంస్థ లక్ష్యాలను నిర్వీర్యం చేస్తునట్లవుతుందన్న అభిప్రాయాలు లేకపోలేదు.

ఈ కేవైసీ చేయించుకుంటేనే 'పీఎం కిసాన్'



నవతెలంగాణ-జన్నారం

ఈకేవైసీ చేయించుకుంటేనే రైతులకు పీఎం కిసాన్ యోజన నగదు లభిస్తుందని మండలంలోని పోన్కల్ క్లస్టర్ ఏఈఓ, త్రిసంధ్య అన్నారు. శనివారం మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఈ కేవైసీ చేయించుకోని రైతులతో ఆమె సమావేశం నిర్వహించి కేవైసీ చేయించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఎం కిసాన్ యోజన డబ్బులు పొందాలంటే తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని ఆమె సూచించారు. జన్నారం క్లస్టర్ పరిధిలోని కొంతమంది రైతులు ఈ కేవైసీ పూర్తి చేయలేదని, దీంతో వారికి మరో విడతలో నగదు జమ కాదని అన్నారు. వీలైనంత తొందరగా దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రానికి ఆధార్ కార్డు, మొబైల్‌ని తీసుకొని వెళ్లి కేవైసీను పూర్తి చేసుకోవాలని కోరారు. మాజీ ఉప సర్పంచ్ రాకేష్ పాల్గొన్నారు.

బీసీ కుల గణన బిల్లు ఆమోదం పట్ల హర్షం



నవతెలంగాణ-మందమర్రి

బీసీ కుల గణన బిల్లు ఆమోదం పట్ల బీసీ యువజన సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేసారు. బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం మందమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాయబారపు కిరణ్ మాట్లాడుతూ బీసీ కుల గణన సమగ్ర బిల్లు తీర్మానంను అసెంబ్లీ ఆమోదించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కుల గణన బిల్లు ఆమోదంతో బీసీ యువతీ యువకులకు విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ అవకాశాలు మెరుగుపడే పరిస్థితి ఉంటుందని తెలిపారు. ఎన్నో యేండ్లుగా అనేక పోరాటాలు చేసిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ యువజన జిల్లా అధ్యక్షులు రాంశెట్టి నరేందర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల సతీష్, మండల ఇన్‌చార్జి ఎండీ జమాల్ పాల్గొన్నారు.

పరీక్షలు అంటే భయాన్ని వీడాలి

● అదనపు కలెక్టర్ బి.రాహుల్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పరీక్షలనేవి మనల్ని భయపెట్టడానికి కాదని, మన నైపుణ్యాన్ని ప్రదర్శించే వేదికలని, ఇలాంటి ఒత్తిడి భయానికి గురికాకుండా పదవ తరగతి పరీక్షలు రాయాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ తెలిపారు. లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు, రానున్న పదవ ప్రేరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ రానున్న నెల రోజులు చాలా కీలకమని, పక్కా ప్రణాళికతో సిద్ధమైతే నూరు శాతం ఫలితాలు సాధ్యం అవ్వడమే కాక, అత్యుత్తమ జీపీఏ కూడా సాధించగలుగుతామని, విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టుకుని ప్రణాళిక బద్ధంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గంగన్న, మంచిర్యాల డీఎల్పీఓ ధర్మారాణి, లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్ కె.రాజశేఖర్, ఎంపీఓ కె.విజయ ప్రసాద్, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు చౌదరి సత్యనారాయణమూర్తి, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ దామోదర్‌రావు, డీసీఈబీ సెక్రటరీ కొండు భీంరావు, జిల్లా సైన్స్ అధికారి ఎస్.మధు బాబు, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ కుమారస్వామి, ప్రముఖ సైకాలజిస్ట్ మహిపాల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలు తాగునీటి వసతి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎంపీడీఓ జేఆర్ ప్రసాద్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ దుర్గం మహేశ్వర్ మాట్లాడుతూ పాఠశాలలో సుమారు 700 పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని తాగునీటి వసతి లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చాలా సందర్భాల్లో సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చామని అన్నారు. స్థానిక నాయకులు చొరవ చూపి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పాఠశాలలో శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి సమస్యను నెలరోజులలోపు పరిష్కరించేలా కృషి చేస్తామని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



నవతెలంగాణ-జన్నారం

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి తమ వంతు తోడ్పాటును అందిస్తున్నామని బ్రైట్ మ్యాప్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కేరేలోవిన్ అన్నారు. మండలంలోని బొమ్మన గిరిజన గ్రామంలో ఐదు నెలలుగా ఆ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని యువతులకు, మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇప్పించి, వారికి ఆ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రైట్ మ్యాప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ఈ ఉచిత కుట్టు మిషన్ కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యకర్తలు నతానియేలు, శారద, గ్రామంలోని గిరిజన మహిళలు యువతులు పాల్గొన్నారు.

ఏకో పార్క్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాంగణంలో ఏకో పార్కు పనులను కేంద్ర బొగ్గు గని శాఖ కార్యదర్శి అమితులాల్ మీనా, సింగరేణి చైర్మన్ అండ్ డైరెక్టర్ బలరాంతో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం ఉపరితల బొగ్గు గని ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సింగరేణిపై ఆధారపడి చాలామంది నివసిస్తున్నారని, ఆహ్లాదాన్ని పంచేందుకు సింగరేణి ఏర్పాటు చేసిన పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఉదయం, సాయంత్రం వ్యాయామాలు చేసుకునేందుకు పార్కులో అన్ని ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. సింగరేణి ఉత్పత్తి చేసిన బొగ్గుతో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను సైతం ఏర్పాటు చేసిందని, దేశంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతుందని సోలార్, జల విద్యుత్ ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ ఏడాదిలోపు ఏకో పార్కు శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికులకు ఉపయోగంలోకి వస్తుందని తెలిపారు. ఈ పార్కులో ముఖ్య అతిథులు మొక్కలను నాటి పర్యావరణానికి మొక్కలు ఎంతో ఆవశ్యకమని తెలియజేశారు. అలాగే ఉపరితల గని వ్యూ పాయింట్ వద్దకు వెళ్లి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు(ఈఅండ్ఎం), ఎన్‌వీకే శ్రీనివాస్(ఆపరేషన్స్, పర్సనల్), జి వెంకటేశ్వర్ రెడ్డి(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, జీఎం(కో ఆర్డినేషన్) ఎం.సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే భవిష్యత్తుపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థి దశ నుండే పిల్లలు భవిష్యత్తుపై దృష్టి సారించాలని నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీష్, ఎస్సై రవికుమార్ అన్నారు. శనివారం నస్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ, పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి, భవిష్యత్తుతో ఎలా చదవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత స్థానాన్ని చేరుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే మాటలను నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ పీహెచ్‌సీ డా.సమత, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



చీడ పీడలపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని సూరారం రైతు వేదికలో రైతులకు యాసంగి సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న పంటలలో చీడ పీడలపై నివారణ చర్యలపై వ్యవసాయ అధికారి సిహెచ్.ప్రభాకర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. మండలంలో సాగు చేస్తున్న వరి పంట ఎక్కువగా పిలక దశ నుంచి చిరుపొట్ట దశలో ఉంది. ప్రస్తుతం వరి పంటలో కాండం తొలిచే పురుగు, సల్ఫైడ్ దుష్ప్రభావం, అగ్గి తెగులు కాండం కుళ్ళు తెగులు ఆశిస్తున్నాయి. కాండం తొలిచే పురుగు, సల్ఫైడ్ దుష్ప్రభావం, అగ్గి తెగులు, కాండం కుళ్ళు తెగుళ్ల యాజమాన్యంపై రైతులు శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కాండం కుళ్ళు తెగులు నివారణకు సల్ఫైడ్ దుష్ప్రభావం తగ్గించడానికి పొలాన్ని వెంట్రుక మందం పగుళ్లు వచ్చేంతవరకు ఆరబెట్టి మరల నీటి తడులు ఇవ్వాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, ఏఈఓ ఇర్ఫాన్ యాస్మీన్ పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మందమర్రి

భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు మాజీ సీఎం కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం టీబీజీకేఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు, వార్డు అధ్యక్షుడు, యువజన, విద్యార్థి విభాగం, సోషల్ మీడియా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ 70వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, డా.రాజారమేష్ ముఖ్య అతిథిగా పాల్గొనికేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

జన్నారం : అభివృద్ధికి మార్గదర్శకుడు మాజీ సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, సుల్వ జనార్ధన్ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌లు అన్నారు. కేసీఆర్ పుట్టినరోజు పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వారు కేకును కట్ చేసి కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్ కుమార్, కమ్మల విజయ్ ధర్మ, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

దండేపల్లి : మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులంతా కలిసి మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసనగొట్టు లింగన్న, అక్కల రవీందర్, బండారి మల్లేష్, పసర్తి అనిల్, జాడి రాజన్న, బోలిషెట్టి లింగన్న, రమేష్, సత్యం, స్వామి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

17ఫిబ్రవరి,జైపూర్02(2): కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జైపూర్ : బీఆర్ఎస్ అధినేత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షులు బలమూరి అరవింద రావు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి తెలంగాణ సాధించిపెట్టిన నాయకుడడని, తెలంగాణ బాపుగా వర్ణించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుండు తిరుపతి పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని దేవాపూర్ గ్రామంలోని ఓసీసీ యూనియన్ కార్యాలయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, ఓరియంట్ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ఎల్లప్పుడూ ప్రజల గుండెల్లో ఉంటాడని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఓరియంట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, అట్టెపల్లి శ్రీనివాస్, వడ్లూరి మల్లేశ్, కైలాస్, మచ్చ అశోక్, అనీల్, గణపతి పాల్గొన్నారు.



కాసిపేట

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 18, 2024 | www.navatelangana.com

ఎలక్ట్రికల్ దుకాణంలో కాపర్‌వైర్ చోరీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఓ ఎలక్ట్రికల్ షాపులో దొంగలు పడి కాపర్ వైర్‌ను దొంగిలించారు. దీని విలువ దాదాపు రూ.5 లక్షల మేర ఉంటుందని దుకాణ యజమాని చెబుతున్నాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. వివరాలు.. పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో గల సినిమా రోడ్ పక్కన రాములు కాంప్లెక్స్‌లోని వాగ్మారే ఎలక్ట్రికల్ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు షెట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. సీసీ కెమెరాను ధ్వంసం చేసి దుకాణం లోపల ఉన్న కాపర్ వైర్‌ను తీసుకుని పరారయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న దుకాణ యజమాని వాగ్మారే శ్రీమంత్ వెంటనే అక్కడకు చేరుకుని పరిశీలించగా దుకాణంలోని వస్తువులన్నీ చిందరవందరగా పడేసి కనిపించాయి. దాదాపు మూడు క్వింటాళ్ల కాపర్ వైర్ చోరీకి గురైందని గుర్తించి తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.ఐదు లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-బేల

పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు ఏనుగు లచ్చారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న కోరారు. శనివారం మండలంలోని పాటన్ గ్రామంలో బాదిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న లచ్చారెడ్డి 18 ఎకరాలను కౌలుకి తీసుకొని సాగు చేస్తున్న సందర్భంలో వ్యవసాయానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై పంట పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. బాదిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 194జీఓ ప్రకారంగా రూ.ఆరు లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కుటుంబ యజమానురాలికి నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, పిల్లలకు ఉపాధి, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ ఫైజుల్లాఖాన్, నర్సారెడ్డి, హరీష్ ఉన్నారు.

పట్టుదలతో చదివితే లక్ష్యాలు సాధించవచ్చు



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు పట్టుదలతో చదివితే జీవిత లక్ష్యాలను సాధించవచ్చని జన్నారం తహసీల్దార్ రాజా మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు, భవిష్యత్తులో వారి కోరిక మేరకు, ఆయా లక్ష్యాలు ఎలా సాధించాలి, అనే అంశాలపై మండల స్థాయి అధికారులచే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చదువుని కష్టంగా కాకుండా ఇష్టపడి చదువుకోవాలని, దీని ద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి పాఠశాలకు మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఎంఈఓ విజయ్ కుమార్, అదనపు ఎస్ఐ సర్కార్, మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత, డాక్టర్ ఉమాశ్రీ, ఏఈ సతీష్, ఈసీ విలాస్, ఎంపీఓ సింగిడి రమేష్, హెచ్ఎం కట్ట రాజమౌళి ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో అధికారికి సన్మానం

నవతెలంగాణ -మందమర్రి

పదవీ విరమణ పొందుతున్న అధికారిని శనివారం జీఎం కార్యాలయ అధికారులు ఘనంగా సన్మానించారు. మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం మనోహర్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందుతున్న జి.నాగేశ్వరరావు ఎస్ఓటు డైరెక్టర్ పీపీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు ఏరియాకి చేసిన సేవలను అధికారులు కొనియాడారు. నాగేశ్వర్‌రావు గతంలో మందమర్రి ఏరియా సేఫ్టీ ఆఫీసర్, కాసిపేట గని మేనేజర్, కాసిపేట గ్రూప్ ఏజెంట్, ఆర్‌ఎస్‌కోల్ వాషరి ఇన్‌చార్జిగా చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కెకె గ్రూప్ ఏజెంట్ రామదాసు, ఏజీఎం ఈఅండ్ఎం నాగరాజు, డీజీఎం ఐఈడీ రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం ఎఫ్అండ్ఏ ఆర్వీఎస్‌కే ప్రసాద్, ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందోపాధ్యాయ, ఎస్టేట్ అధికారి కుమారస్వామి, క్వాలిటీ ఇన్‌చార్జి ప్రదీప్ పాల్గొన్నారు.

జన్నారంలో ఐదు ట్రాక్టర్ల సీజ్

జన్నారం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపాన ప్రధాన రహదారిపై శనివారం మంచిర్యాల ఏఎంవీఐ శ్రీకాంత్, వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని ఐదు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ తప్పకుండా చేయించుకోవాలని సూచించారు.

విజిలెన్స్ యాంటీ కరప్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక

రామకృష్ణాపూర్ : విజిలెన్స్, యాంటీ కరప్షన్ కౌన్సిల్(వీఏసీసీ)రాష్ట్ర అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది, సామాజికవేత్త వేల్పుల మురళీధర్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శనివారం కౌన్సిల్ చైర్మన్, న్యాయవాది డా.రాజలింగు మోతె తెలిపారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను పట్టణంలోని స్థానిక కౌన్సిల్ కార్యాలయంలో అందజేశారు. కౌన్సిల్ బలోపేతానికి నిబద్ధతతో పనిచేయాలని, అవినీతిని, సాంఘిక దురాచారాలను నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. పోలీస్, ప్రెస్ మీడియా సమన్వయంతో నేరాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు.

కొండాపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

కాసిపేట: మండలంలోని కొండాపూర్ యాప గ్రామంలో శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు ఈజీఎస్ పథకం కింద మండలానికి మంజూరైన కోటి ఇరువై లక్షల నిధుల నుంచి సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ మాట్లాడుతూ అభివృద్ధి పథంలో కాసిపేట మండలాన్ని ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే గడ్డం వినోద్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సహకార చైర్మన్ పుస్కూరి వంశీ కృష్ణారావు, వుత్తూరి సత్తయ్య, అప్పని ప్రభాకర్, మాజీ సర్పంచ్ మక్కుల శ్రీనివాస్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మైదం రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, చారి, మహంకాళి, భూక్య రవి, షారుక్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



లక్షెట్టిపేట : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, పని చేసిన చోట మంచి పేరు తెచ్చుకున్న వారే ప్రజల గుండెల్లో నిలిచి పోతారని ఎంపీపీ అన్నం మంగ చిన్నయ్య అన్నారు. లక్షెట్టిపేటలో గత రెండు సంవత్సరాలు ఎంపీడీఓగా పని చేసి ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లిన నాగేశ్వర్ రెడ్డికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మండల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం ఉద్యోగులు ఆయనకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దేవేందర్ రావు, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఏపిఓ వెంకట రమణ, ఉద్యోగులు నరేందర్, వరుణ్, ప్రదీప్, రాజేష్, సుజాత, బూసిరాజు రాజన్న, శైలజ, ఎంపీటీసీ సభ్యులు, తాజమాజీ సర్పంచులు పాల్గొన్నారు.

19లోపు పరిశీలించుకోవాలి

ఉట్నూర్ : విద్యుత్ వినియగదారులు గృహ జ్యోతి పథకానికి నిర్వహిస్తున్న సర్వేకు సహకరించాలని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19లోపు ఆధార్, రేషన్ కార్డ్, ప్రజా పాలన రసీదు, ఫోన్ నంబర్లు తీసుకొని విద్యుత్ కార్యాలయానికి వచ్చి మీ విద్యుత్ సర్వీస్ నంబర్‌కి జత చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగులు ఐక్యంగా ఉంటూ సమస్యలను సంఘం దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహీద్ హుస్సేన్ అన్నారు. కామర్షియల్ ట్యాక్సెస్ కార్యాలయంలో సంఘం జనరల్ బాడీ ఎన్నికలు నిర్వహించారు. దీనికి జాయింట్ కమీషనర్ శ్రీనివాస్‌తో కలిసి రాష్ట్ర అద్యక్షుడు అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికలకు అధికారులుగా జి. శ్రీనివాస్, ప్రభాకర్ వ్యహరించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హరికిషన్, సాయి కృష్ణలతో పాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి జాయింట్ కమిషనర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా నూతన సంఘం తరపున వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరమే లక్ష్యంగా సంఘం పని చేస్తుందని తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజహీద్ హుస్సేన్ అన్నారు. వారి సమస్యలను సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఉద్యోగులకు అందుబాటులో ఉండాలన్నారు. పదోన్నతుల విషయమై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, త్వరలో దాన్ని కూడా సాధిస్తామన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మేలగాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్‌ఆర్ ప్రసాద్



నవతెలంగాణ-జైనథ్

విద్యార్థులు సత్ప్రవర్తనతో న్యాయబద్ధంగా మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. సీహెచ్‌వీఆర్‌ఆర్ ప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకి ఆయన ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఉన్న సాంకేతికతను తాముకు ప్రయోజనం పొందడానికే ఉపయోగించాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కోడిచెర్ల సుదర్శన్, మాజీ సర్పంచ్ దేవన్న, పులివేణి గణేష్, కార్యదర్శి ముజీబ్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైర్మన్‌ను కలిసిన కమిషనర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ఖమర్ అహ్మద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ను గౌరవప్రదంగా కలిశారు. చైర్మన్‌కు పూల బొకే అందించారు. పట్టణంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు.

కమిషనర్ కలిసిన మున్సిపల్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు

మున్సిపల్ ఆటో యూనియన్ డ్రైవర్స్ శనివారం నూతనంగా నియమితులైన మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. తమ ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ జనార్దన్, వైస్ ప్రెసిడెంట్ ఎండి అజీమ్, జనరల్ సెక్రటరీ లింగంపల్లి శ్యామ్, రాకేష్, నసీం, నాగేష్, రవీందర్ కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-బోథ్

రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగ వాటి పరిష్కరం కోసం హామీ ఇచ్చినట్టు తెలిపారు. బోథ్‌తో పాటు నూతనంగా ఏర్పాటైన సోనాల మండలానికి సెంట్రల్ లైటింగ్‌కు రూ. కోటి నిధులు మంజూరు చేయాలని కోరారు. నిధులు మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారుకు ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయనతో పాటు బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, భీంపూర్ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ మంత్రిని కలిశారు.

హమాలీల ఉపాధికి విఘాతం కలిగించొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హమాలీ కార్మికుల ఉపాధికి విఘాతం కలగకుండా జిల్లా అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని క్రాంతికార్ హమాలీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వారితో స్థానికంగా ఉండే కార్మికులకు పని దొరకడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, పలు డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ముఖ్యంగా హమాలీలకు లేబర్ కార్డులు జారీ చేసే విధంగా తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చేవారి మూలంగా స్థానికంగా ఉండే కార్మికులకు ఉపాధి పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలని సంబంధితశాఖ అధికారులను కోరారు. అలాగే క్రాంతికార్ హమాలీ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు వారు వెల్లడించారు.

బీసీ జనగణనకు ఆమోదం తెలపడం పట్ల హర్షం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీసీ జనగణన చేపట్టడానికి శాసనసభలో పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం పట్ల హర్షనీయమనిఇ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలల శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాట్లాడారు. బీసీ కులాల వారిని ఇన్ని రోజులుగా ఏ ప్రభుత్వం గుర్తించకపోవడం దురదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 2014లో సమగ్ర సర్వే నిర్వహించారని,కానీ ఆ సమగ్ర సర్వే నివేదికను ఇప్పటివరకు బహిర్గతం చేయకపోవడం శోచనీయమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా మన జాతీయ బీసీ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. దాని ఫలితంగానే నేడు బీసీ కులగణన బిల్లును శాసనసభలో ఏకపక్ష నిర్ణయంగా తీసుకురావడం ఈ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మంచి నిర్ణయంగా భావిస్తున్నామన్నారు. బీసీ కులగణన బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు ఈ బిల్లుకు మద్దతిచ్చిన ప్రతి ఒక్క శాసనసభ్యునికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, నాయకులు పాల్గొన్నారు.

పాలీసెట్ షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ డిప్లొమాలో ప్రవేశం కోసం నిర్వహించే పాలిటెక్నిక్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా సమన్వయకర్త భరద్వాజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఏప్రిల్ 22వ తేదీ వరకు ఉందన్నారు. మే 17న పాలీసెట్ ఉంటుందని పేర్కొన్నారు. పదోతరగతి పూర్తయిన, చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ మూడు సంవత్సరాల డిప్లొమో కోర్సులలో 60 సీట్లు చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. ఉట్నూరులోని ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులలో 60 సీట్ల చొప్పున ఉన్నాయన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని రణదివెనగర్‌లో జరిగింది. కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం..కాలనీకి చెందిన రాజుపుత్రు(25) తల్లి, భార్య శనివారం మహారాష్ట్రకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్సై గోవింద్ తెలిపారు.

పర్యావరణ రహిత జెడ్పీపై అవగాహన



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నమూనా పర్యావరణ రహిత జిల్లా పరిషత్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రధానమైన జాతర సమ్మక్క సారలమ్మ భక్తులకు చైతన్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందన్నారు. జాతరలో మెలుకువలు, జాగ్రత్తలు పాటించే విధంగా ప్రభుత్వ ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ కంటే ప్రజలకు అందుబాటులో ఉండే జిల్లా పరిషత్ చైర్మెన్ సీఈఓ, జెడ్పీటీసీలు పాఠశాల నిర్ణయాలు సమస్యలు తెలిపే విధంగా మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా పరిషత్‌లో పనిచేసే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఎవరు ఉంటారు, విధి నిర్వహణలో ఏఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు అనే అంశాలపై మాక్ పోలింగ్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, మేకల మురళీధర్, ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఉదారత



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి పాటిల్ నాగోరావ్ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా ఆదిలాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు తన వంతుగా విద్యార్థులకు అవసరమైన రూ.4వేల విలువగల లైబ్రరీ పుస్తకాలను విరాళంగా అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు సంతోష్, శ్రీనివాస్, అమరేందర్, ఉమా మహేష్, పవన్ పాల్గొన్నారు.

రేపు ఛత్రపతి జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఈ నెల 19న నిర్వహించనున్నట్టు మరాఠా తిరిలే కుంబీ సమాజ్ జిల్లా అధ్యక్షులు సావాపురే విజయ్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కుంబీ సమాజ్ సభ్యులతో కలిసి కార్యక్రమ వివరాలను ఆయన వెల్లడించారు. పట్టణంలోని రామ్‌లీలా మైదానం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం మహారాష్ట్ర డోలు, వాయిద్యాల నడుమ హిందూ సంప్రదాయరీతిలో భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. స్థానిక రామ్‌లీలా మైదానం నుండి ప్రారంభమయ్యే ఈ శోభాయాత్ర వినాయక్‌చౌక్, నేతాజీచౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా శివాజీచౌక్ వరకు సాగుతుందన్నారు. శివాజీ విగ్రహానికి పూలమాలలతో పూజలు నిర్వహించి నివాళ్లులర్పించడం జరుగుతుందని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మారణం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మాణం చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం..జందాపూర్, చందా-టీ మధ్యలో 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మాణం చెందాడు. నాగపూర్‌కి వెళ్లే రోడ్డులో 35 నుంచి 40 మధ్య వయసు ఉన్న వ్యక్తి ప్రమాదంలో పూర్తిగా నుజ్జునుజ్జు అయినట్లు తెలిపారు. గుర్తుపట్టలేని స్థితిలో శవం ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ముజాహిద్ తెలిపారు.

20న విద్యాసంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంత్ సేవాలాల్ మహారాజ్ అధికారిక జయంతి వేడుకలను పురస్కరించుకొని ఈనెల 20న ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. తిరిగి ఏప్రిల్ రెండో శనివారం పని దినంగా పరిగణించాలని సూచించారు. కాగా అటు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ కాలేజీలకు సెలవు ఉండదని స్పష్టం చేశారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువ కేంద్ర జాతీయ యువజన పార్లమెంట్ ఉత్సవాల్లో భాగంగా జాతీయస్థాయి ఉపన్యాస పోటీలను నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యూత్ ఆఫీసర్ సుశీల్ బడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19లోపు ఔత్సాహికులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మైభారత్.జీఓవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9618174338, 9381731381, నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

పరీక్షకు కుట్టుమిషన్ తెచ్చుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే టైలరింగ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కుట్టుమిషన్లు స్వయంగా తెచ్చుకోవాలని ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షల హాల్ టికెట్‌లను బీఎస్‌ఈ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. డౌన్‌లోడ్ కోసం జిల్లా, ట్రేడ్‌ను ఎంపిక చేసుకుని పుట్టిన తేదీ నమోదు చేయాలని సూచించారు.